బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేత


నిమ్స్ దవాఖానలో బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేస్తున్న మాజీ సర్పంచ్ నరేశ్

సిద్దిపేట, డిసెంబర్ 30 : నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి గుండె చికిత్సకు రూ.2.50 లక్షల ఎల్వోసీని అందజేసి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అండగా నిలిచారు. సిద్దిపేటరూరల్ మండలం పూల్లూరు గ్రామానికి చెందిన మంగలారపు చంద్రయ్య గుండె నొప్పితో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ కోసం మాజీ సర్పంచ్ నరేశ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఎమ్మెల్యే హరీశ్‌రావు కలిసి విషయం తెలియజేశారు. దీంతో స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. సంబంధిత ఎల్వోసీని నరేశ్ నిమ్స్‌దవాఖాన వెళ్లి చంద్రయ్యకు టంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్

సిద్దిపేట, డిసెంబర్ 30 : ప్రైవేటు దవాఖానల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రతి దవాఖానలో సేవలకు సంబంధించిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌పల్వన్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో జిల్లాలోని ఐఎంఏ ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు, వైద్యాధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. యాజమాన్యాలు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేదా రెన్యువల్స్ చేసుకోవాలన్నా జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్రైవేట్ దవాఖానల వైద్యాధికారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ

వృద్ధులకు దుప్పట్లను అందజేస్తున్న నియోజకవర్గ అధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డి

సిద్దిపేట, డిసెంబర్ 30 : మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు సూచన మేరకు సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్‌లో గల వృద్ధాశ్రమంలో దుప్పట్లను పంపిణీ చేసినట్లు బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్ రెడ్డి చెప్పారు. యువజన విభాగం కార్యకర్తలు అజయ్, రాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ చేనేత కార్మికుల పద్మశాలీ సంఘం నాయకులు

సిద్దిపేట, డిసెంబర్ 30 : స్వాతంత్రం సిద్ధించి 70 ఏండ్లు గడిచినా ఇప్పటికీ చేనేత కార్మికులు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని తెలంగాణ పద్మశాలీ చేనేత కార్మికుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేటలో తెలంగాణ చేనేత కార్మికుల పద్మశాలీ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట క్లాక్ టవర్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, దుర్గేశ్, రామచంద్రం, పలువురు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతల రోడ్డు

గుర్రాలగొంది లో గుంతలుగా ఉన్న రోడ్డు

నారాయణరావుపేట, డిసెంబర్ 30 : నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో ప్రధాన రహదారుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట నుంచి వేములవాడ ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాదిమంది ఈ రహదారి గుండానే వెళ్తూ ఉంటారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ధూళిమిట్టలో ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 30 : ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన రైతు దుబ్బుడు భూపాల్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్ బ్యాటరీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఎప్పటిమాదిరిగానే తన వ్యవసాయ బావి వద్ద పొలం దున్ని ట్రాక్టర్‌ను అక్కడే ఉంచి రాత్రి ఇంటికి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున బావి వద్దకు వెళ్లి చూడగా ట్రాక్టర్ బ్యాటరీ చోరీ అయినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కొన్నాళ్లుగా ఉమ్మడి మద్దూరు మండలంలో సుమారు 50 ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురైనా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. బ్యాటరీ చోరీపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకోవాలని మండల రైతాంగం పోలీస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

మా ఉపాధ్యాయులు మాకే కావాలి

జగదేవ్‌పూర్, డిసెంబర్ 30 : మా ఉపాధ్యాయులు మాకే కావాలంటూ కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులు అధికారులతో అన్నారు. ఉపాధ్యాయుల సమ్మెలో ఉండడంతో ఎంతోమంది మాధవరెడ్డి సోమవారం ఇద్దరు ఉపాధ్యాయురాళ్లను కేజీబీవీకి పంపారు. మా ఉపాధ్యాయులు మాకే కావాలి అంటే ఉదయం ఉపాధ్యాయులు రాకుండా అడ్డుకున్నారు. వచ్చిన ఉపాధ్యాయులు మాతోనే ఉండాలని సాయంత్రం వారు వెళ్లకుండా గేటుకు తాళం వేసి గంట సేపటి వరకు అడ్డుకుని నినాదాలు చేశారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 30 : భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మద్దూరు ఆర్ఐ రమేశ్, ఏఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మద్దూరు మండలంలోని వల్లంపట్లలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరుల హక్కులకు విఘాతం కల్గించే విధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేందర్

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 30 : విద్యార్థి దశలో క్రమశిక్షణ ప్రధానమైనదని విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ ఆకాంక్షించారు. స్థానిక సహస్ర పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు,గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ శాంతికిరణ్,ఉపాధ్యాయులు,షీటీమ్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ మనుచౌదరి

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 30 : ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ మనుచౌదరి, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తమ తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చి న అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుం డా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లు గురించి వచ్చిన దరఖాస్తులు 49 స్వీకరించారు. ప్రజావాణి అనంతరం 31వ బాలల జాతీయ సైన్స్‌లో జాతీయ స్థాయికి ఎన్నికైన మర్కుక్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధామరకుంట గ్రామానికి చెందిన విద్యార్థులు అశ్వంత్, కార్తీక్ చారిని కలెక్టర్ మను చౌదరి అభినందించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌వో నాగరాజ మ్మ, డీఆర్డీవో జయదేవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళ లపై దాడులను అరికట్టాలి

ఐద్వా రాష్ట్రప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సిద్దిపేట, డిసెంబర్ 30 : నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, మహిళలపై రోజురోజుకూ పెరిగిపోతున్న హింసను అరికట్టడంలో వైఫల్యం చెందిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన అధ్యక్షతన ఐద్వా జిల్లా వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 11 ఏండ్ల కాలంలో రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూనే ఉందన్నారు. ధరలను తగ్గిస్తానని మాయమాటలు చెప్పి మూడుసార్లు అధికారంలోకి వచ్చింది కానీ అదుపు చేయకపోగా, మరింత పెంచిందన్నా రు. గతంతో పోలిస్తే వంద శాతం ధరలు పెరిగాయన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అత్తిని శారద, జిల్లా ఉపాధ్యక్షురాలు మంజులత, జిల్లా సహాయ కార్యదర్శులు జాలిగపు శిరీష, ఇప్పకాయల శోభ, జిల్లా నాయకురాలు సందబోయిన రాణి, దండు లక్ష్మి, జ్యోతి, లక్ష్మి, శోభ, నర్సవ్వ, మల్లవ్వ, విఘ్నేశ్వరి, లావణ్య, వరలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి

చేర్యాల/సిద్దిపేట కమాన్ డిసెంబర్ 30 : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, నాయకులు దర్శనం రమేశ్, బోయిని మల్లేశం అన్నారు. ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా కార్యదర్శి (ఎస్ఎఫ్ఐ) దాసరి ప్రశాంత్ పాల్గొని ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చొరవ చూపడం లేదన్నారు. డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్, నాయకులు తాడూరి విక్రం, గొర్రె మధు, మహేశ్, అనిల్ పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి రైతు మృతి

దుబ్బాక, డిసెంబర్ 30 : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ రైతు మృతి చెందిన విషాద సంఘటన దుబ్బాక మండలం రామక్కపేటలో నెలకొన్నది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం దుబ్బాక పోలీసులు వెల్లడించారు. రామక్కపేటకు చెందిన అనుముల లింగం (48) రైతు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సాయంత్రం గడిచినా లింగం ఇంటికి తిరిగి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు వ్యవసాయ పొలానికి వెళ్లి చూశారు. పొలం ఒడ్డుపై లింగం చెప్పులు ఉండటంతో, పక్కనే ఉన్నా వ్యవసాయ బావి లో చూడగా మృతదేహం కనిపించింది. స్థానిక రైతుల సాయంతో బావిలో నుంచి లింగం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగా రాజు తెలిపారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రసన్నహరికృష్ణ

గజ్వేల్, డిసెంబర్ 30: అన్ని వర్గాలకు చెందిన ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించడం విషయంలో తాను ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని ప్రభుత్వం దృష్టికి తీసుకవచ్చి అమలు చేసే విధంగా కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలో మార్నింగ్ వాకర్స్‌తో ముఖముఖీ, పలు పాఠశాలల యాజమాన్యం, సిబ్బందిని కలిసి మద్దతు కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మొదట ఉద్యోగం చేసినప్పటికీ తర్వాత రాజీనామా చేసి ఎమ్మెల్సీ బరిలోకి దిగానన్నారు. ఆయా పాఠశాల, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్గల్‌లో..

వర్గల్, డిసెంబర్ 30 : తనకు ఒక్కసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే నిరుద్యోగులపట్ల అండగా ఉంటానని మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. సోమవారం వర్గల్ మండలకేంద్రంలో నిర్వహించిన పట్టభద్రులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, క్లర్క్ కరుణాకర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సోమవతి అమావాస్య పూజలు

రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

కొండపాక, డిసెంబర్ 30 : స్త్రీలకు సంతాన సౌభాగ్యాలకు ప్రసాధించే సోమవతి అమావాస్య అత్యంత శ్రేష్ఠమైనదని మర్పడగక్షేత్ర నిర్వాహకులు చెప్యాల హరినాథశర్మ అన్నారు. సోమవారం మండలపరిధిలోని మార్పడ గ్రామంలోని శ్రీవిజయదుర్గా సమోత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రం సోమవతి అమావాస్యను పురస్కరించుకొని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివకేశవుల ప్రీతిపాత్రమైన ఈ వత్రాన్ని భీష్మ పాతామహుడు ధర్మరాజుకు ఉపదేశించాడని తెలిపారు. ఈ క్షేత్రంలో క్రమం తప్పకుండా సోమవతి అమావాస్య వత్రాన్ని ఆచరిస్తున్నమని తెలిపారు. శివకేశవులకు ప్రీతిపాత్రమైన అమావాస్య శుభప్రదమైనదిగా పేర్కొన్నారు. ఈ అమావాస్య వత్రచరణ శుభపలితాలను ఇస్తుందన్నారు. సోమవారం అమావాస్యకావడంతో మహిళలు క్షేత్రంలోని రావిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, బాలరాజేశం, గట్టు విఠల్,రాజేంద్రప్రసాద్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి పేరుతో దాడి.. హేయమైన చర్య

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం అందజేస్తున్న డీబీఎఫ్ శంకర్

చేర్యాల, డిసెంబర్ 30 : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్న దళిత హెచ్ఎం మాల ఆచరించిన విద్యార్థిని తాకడంతో పలువురు భక్తి పేరుతో కాళ్లు మొక్కించడం హేయమైన చర్య అని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం రమేశ్ అన్నారు. భక్తి పేరుతో దాడి చేయడం కాళ్లు మొక్కించడంపై పట్టణంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశా రు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కోనేరు ప్రవీణ్, తాడూరి విక్రమ్, గొర్రె మధు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 30 : పాఠశాలలో చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పి సమాజానికి నిర్దేశం చేసే ప్రధానోపాధ్యాయుడిని అవమాన పర్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ (డీబీఎఫ్) కార్యదర్శి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మత విశ్వాస, విద్వేష కార్యక్రమాలను అరి కట్టి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మాజీ ఎంపీటీసీ భీమయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, డిసెంబర్ 30 : మండలంలోని గుండారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపల్లి భీమయ్య తల్లి లచ్చవ్వ, గ్రామస్తురాలు స్వరూప, గూడెం గ్రామానికి చెందిన నారెడ్డి సుదర్శన్‌రెడ్డి తల్లి కౌసల్య, పెరుకబండ గ్రామానికి చెందిన పోతుల లచ్చవ్వ ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సోమవారం పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింతకింది శ్రీనివాస్‌గుప్తా, కచ్చు రాజయ్య, హన్మాండ్ల లక్ష్మారెడ్డి, బొమ్మకంటి రామలింగారెడ్డి, శేఖర్ బాబు, ముక్కీస తిరుపతిరెడ్డి, బాబు, శ్రీనివాస్,స్వామి, కిష్టయ్య, శేఖర్, సరోజన, మల్లేశం, బాబు, అంజయ్య, రాములు, నరేశ్ ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమాదేవి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 30 : ఏడు నుంచి మూడు ఏండ్లలోపు పిల్లలకు ప్రభుత్వం అందించే బాలామృతం, గుడ్లు తదితర పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని చేర్యాల ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి అన్నారు. సోమవారం మద్దూరు హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు టీఎచ్ఆర్(టేక్ రేషన్ హోమ్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ 'పోషణ్ ట్రాకర్ యాప్'లో ముఖ ధ్రువీకరణ పద్ధతి ద్వారా పిల్లలకు టీహెచ్ఆర్ ఆహారాన్ని అందించాలన్నారు. పౌష్టికాహారం పంపిణీలో పారదర్శకతను పాటించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను వినియోగంలోకి తీసుకవచ్చిందన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభినియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ కనకరాజు, సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బొంగు రాజేందర్‌రెడ్డి

కొమురవెల్లి, డిసెంబర్ 30 : నిరుపేద కుటుంబాలను అదుకోవడమే బీఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొంగు రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బండకింది ఐల్వ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజేందర్ రెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని సోమవారం అందజేశారు. కొమురవెల్లి గౌడ సంఘం నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడు బత్తిని యాదగిరి, దొడ్ల విష్ణుమూర్తి, అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు, ప్రధానకార్యదర్శి శివలింగం రమేశ్, కోధశాధికారి బత్తిని శివయ్య, యూత్ అధ్యక్షుడు కొయ్యడ నరేశ్, మాట్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి పలువురికి గాయాలు

హుస్నాబాద్‌రూరల్, డిసెంబర్ 30 : మండలంలోని గాంధీనగర్‌లో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన ఓ రైతు పొలంలో వ్యవసాయ పనులకు కూలీలు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 20 మంది వరకు కూలీలు కిందపడగా ఆరుగురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ దవాఖానకు తరలించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

మద్దూరు (ధూళిమిట్ట), డిసెంబర్ 30 : ధూళిమిట్ట మండల కేంద్రంలోని హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయిలో సాంఘిక శాస్త్రం ప్రతిభా పరీక్షను నిర్వహించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కాంప్లెక్స్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కొండాపూర్ హెచ్ఎం రామచంద్రం, సాంఘీక శాస్త్ర మండల ఫోరం కన్వీనర్ సుద్దాల రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు రాములు, నర్సింహులు, మల్లయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గజ్వేల్, డిసెంబర్ 30 : పట్టణంలోని లక్ష్మీప్రసన్న కాలనీ శివారులో కొంతమంది వ్యక్తులు కలిసి పేకాట ఆడుతున్నరనే సమాచారంతో పోలీసులు సోమవారం దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో ముగ్గురికి ఆదుపులోకి తీసుకోగా, మరో ఐదుగురు పారిపోయినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3, 610 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దివ్యాంగులకు బస్ పాసులు పంపిణీ

చేర్యాల, డిసెంబర్ 30 : పట్టణంలోని మనోచేతన దివ్యాంగుల కేంద్రంలో సోమవారం గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులను కౌన్సిలర్ ఆడెపు నరేందర్ నిర్వాహకులతో కలిసి అందజేశారు. మనోచేతన పర్యావేక్షకులు కాశెట్టి రమాదేవి, ఏఎంసీ డైరెక్టర్ తడ్క లింగం, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, దాసరి శ్రీకాంత్, అంబాల రాములు గౌడ్, అల్లం రవి, రేకులపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి, డిసెంబర్ 30 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయం సంస్థ ద్వారా 2025-26వ విద్యా సంవత్సరానికి 5వ తరగతితో పాటు 6వ తరగతి నుంచి 9వ తరగతుల్లో రిజిస్ట్రేషన్ ఖాళీ సీట్లకు ప్రవేశాల కోసం అర్హత పరీక్షను నిర్వహిస్తున్నట్లు మిరుదొడ్డి మండలంలోని అల్వాల గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ రఘునందన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మీ సేవాలో రూ.వంద చెల్లించి http// tgcet. cgg. gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 2025 ఫిబ్రవరి 23వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి మీ సేవా కేంద్రాల్లో విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హనుమంతరెడ్డి సేవలు మరువలేనివి

శంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి, గోవిందు రవి

హుస్నాబాద్, డిసెంబర్ 30 : హుస్నాబాద్ పట్టణంలోని ఆదర్శ హమాలీ సంఘం గౌరవాధ్యక్షుడిగా, సీనియర్ రాజకీయ నాయకుడిగా, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా హనుమంతరెడ్డి చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి తీరని లోటని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. హనుమంతరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. స్థానిక నేతలు ఉన్నారు.

మల్లన్న కల్యాణోత్సవం ఆదాయం రూ.16,51,520

చేర్యాల, డిసెంబర్ 30 : కొమురవెల్